సైబర్ నేరగాళ్ల మరో కొత్త ఎత్తుగడ

- ఏపీకే ఫైల్ పేరుతో సైబర్ నేరగాళ్ల బురిడీ
- మీ బండిపై చలాన్ ఉందంటూ మోసం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



శెనార్తి మీడియా, మంచిర్యాల:

సాంకేతికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ, సైబర్ నేరాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి. సాంకేతికతను ఆసరాగా చేసుకొని కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా హైదరాబాద్ లో మరో కొత్త సైబర్ నేరం బయటపడింది. ట్రాఫిక్ చలాన్ పేరిట ప్రజలను మోసగించేందుకు ఎత్తుగడ వేస్తున్నారు. 'మీ బండిపై చలాన్ ఉంది.. కట్టేయండి' అనే మెసేజ్‌లతో, 'RTO Traffic Challan.apk2' అనే ఫైల్‌ను వాట్సాప్ ద్వారా పంపుతూ ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారు.

చలాన్ పేరిట వైరస్ ఫైల్

ఈ ఫైల్ ఒక ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే). దీన్ని ఓపెన్ చేస్తే, మన ఫోన్ నేరుగా నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఈ ఫైల్ ద్వారా ఫోన్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్లు యాక్సెస్ చేసుకుంటారు. బ్యాంకింగ్ వివరాలు, పాస్‌వర్డులు, క్రెడిట్ కార్డ్ సమాచారం, ఎస్ఎంఎస్ నోటిఫికేషన్లు అన్నీ వారి నియంత్రణలోకి వెళ్తాయి.

సాయంత్రం సమయంలో మోసాలకు తెర

ఈ తరహా ఫైల్స్‌ను ఎక్కువగా సాయంత్రం వేళల్లో పంపిస్తున్నట్టు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. రోజంతా తమ పనులకు వెళ్లిన వారు సాయంత్రం వేళ్లలో అలసిన సమయంలో వస్తున్న మెసేజ్‌లపై అనుమానం లేకుండా ఫైల్‌ను ఓపెన్ చేయడంతో సైబర్ నేరగాళ్ల మోసానికి బలవుతున్నారు. "ఫోన్ ఒకసారి హ్యాక్ అయితే, ఆ వ్యక్తి ఆర్థిక భద్రత పూర్తిగా సంక్షోభంలో పడిపోతుంది" అని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఎస్ఎంఎస్‌లు కూడా అదుపులోకి

ఈ ఫైల్‌ను ఓపెన్ చేసిన తర్వాత, సైబర్ నేరగాళ్లు ఫోన్‌ను రిమోట్ ద్వారా నియంత్రించగలుగుతారు. వ్యక్తిగతంగా వస్తున్న ఎస్ఎంఎస్ లను కూడా నిరోధించి, ఓటీపీలు, లావాదేవీల సమాచారం యజమానికి రాకుండా చేస్తారు. ఫలితంగా, ఖాతాల్లో డబ్బులు మాయమైనా బాధితుడికి అర్థం కాదు.

జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

- గూగుల్ ప్లేస్టోర్ కాకుండా ఇతర లింకుల ద్వారా ఏపీకే ఫైల్స్ ఇన్‌స్టాల్ చేయరాదు.
- గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌లను ఓపెన్ చేయరాదు.
- బ్యాంకింగ్ యాప్‌లకు, క్రెడిట్ కార్డులకు ఓటీపీ అథెంటికేషన్ తప్పని సరిగా ఉంచాలి.
- అనుమానం వచ్చిన వెంటనే సంబంధిత బ్యాంకుకు సమాచారం ఇవ్వాలి.
- కార్డులను బ్లాక్ చేయడం ద్వారా మోసం ఇంకా జరగకుండా ఆపవచ్చు.
- సైబర్ మోసాలపై వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి లేదా 8712672222 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సాధారణంగా ట్రాఫిక్ చలాన్ మెసేజ్‌లు అధికారికంగా రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ శాఖ లేదా పోలీస్ శాఖ వెబ్‌సైట్ల నుంచి మాత్రమే వస్తాయి. వాటిని తమ అధికారిక వెబ్‌సైట్‌లోనే ధృవీకరించాల్సిన అవసరం ఉంటుంది. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండకపోతే, ఈ తరహా మోసాలకు గురవుతున్నారు. మొబైల్ కు ఏ రకమైన సందేశాలు వచ్చినా వెంటనే ఓపెన్ చేయొద్దు. ముందుగా ఆ మెసేజ్ ఏంటో గమనించాలి.

ఆర్ ప్రకాష్, ఏసీపీ, మంచిర్యాల

అప్రమత్తతే రక్షణ

ఏపీకే రూపంలో చలాన్లు కట్టాలని మెసేజ్ లురావు. వాహనదారులు, ప్రజలు వీటిని గుర్తించాలి. సైబర్ నేరస్తులు రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. అందులో భాగంగా ఈ తరహా విధానాన్ని ఎంచుకున్నారు. సోషల్ మీడియా ప్లాట్ ఫాంలు వినియోగించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏ కాస్త ఏమరపాటుగా ఉన్న వ్యక్తిగత సమాచారంతో పాటు బ్యాంకు వివరాలన్నీ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతాయి.

- బీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, మంచిర్యాల



మహిళల ఆర్థిక ఎదుగుదలే లక్ష్యం

- 3882 కొత్త రేషన్ కార్డుల మంజూరు
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

శెనార్తి మీడియా, మంచిర్యాల:

ప్రతి మహిళను కోటీశ్వరురాలిగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం మండలంలోని అందుగులపేట సాయిమిత్ర గార్డెన్స్‌లో నిర్వహించిన ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ.17.21 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. వడ్డీ లేని రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వావలంబులవుతూ వ్యాపారాలు విస్తరించుకుంటూ, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదుగుతున్నారని పేర్కొన్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా పట్టణాల్లో క్యాంటీన్లు, ఎలక్ట్రిక్ బస్సులు, పెట్రోలు బంకులు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు పెంపు విషయంపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించే ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

3882 కొత్త రేషన్ కార్డులు

చెన్నూరు నియోజకవర్గంలో 3882 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసినట్టు తెలిపారు. మరో 3880 మందికి కొత్తగా పేర్లు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. రేషన్ కార్డుల మంజూరు ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని కోరారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఆర్డీఓ పీడీ ఎస్. కిషన్, ఐకేపీ డీపీఎం స్వర్ణలత, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపు వెనుక ఎమ్మెల్యే పీఎస్సార్ హస్తం

- గుట్టల మాయం అభివృద్ధి కాదు: మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

శెనార్తి మీడియా, మంచిర్యాల: మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ గుట్టల మట్టి అక్రమ తవ్వకానికి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. దండేపల్లి మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడిన దివాకర్ రావు, రెబ్బెనపల్లి, నెల్కీ వెంకటాపూర్ శివారుల్లోని సర్వే నెంబర్ 9, 521, 444లలో ఉన్న గుట్టలను మైనింగ్ శాఖ అనుమతులు లేకుండానే తవ్వించి వేలాది టిప్పర్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఒక్కో టిప్పర్ విలువ రూ.5000గా లెక్క వేసుకుంటే ఇప్పటికే కోట్ల రూపాయల మట్టిని అమ్మినట్లు అవుతోంది అన్నారు. ఈ తవ్వకాలపై టెండర్లు పిలిచి జరిగితే ఆదాయం ప్రభుత్వ ఖాతాలోకి వచ్చేదని, కానీ ప్రేమ్ సాగర్ రావుతోపాటు కాంగ్రెస్ నేతల స్వార్థం కోసం అర్హతలేని వారితో అక్రమంగా తవ్వకాలు జరిపిస్తున్నారని ధ్వజమెత్తారు. రాత్రింబవళ్ళు టిప్పర్లు తిరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలు నిశ్శబ్దంగా చూస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే ఈ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. "ఇది మట్టి కాదు.. నేరం. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ అక్రమాల్లో పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయిస్తాం, అధికారులను సస్పెండ్ చేయిస్తాం" అని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఈవోను అభినందించిన ఎమ్మెల్యే

బ్యాగ్ తూకం వేసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం, పక్కన ఎంఈవో ప్రభాకర్ రావు

శెనార్తి మీడియా, గంగాధర :

గంగాధర ఎంఈవో ఏనుగు ప్రభాకర్ రావును చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పాఠ్య పుస్తకాల బ్యాగు గతంలో పది కిలోలు ఉండడంతో విద్యార్థులకు భారంగా మారి ఇబ్బందులు పడుతున్నారు. విషయం గమనించిన ఎంఈవో ప్రభాకర్ రావు బడి బ్యాగు కేవలం మూడు కిలోలు మాత్రమే ఉండేలా కొత్త పుస్తకాలను ఇచ్చారు. దీంతో విద్యార్థులు ప్రతిరోజు మూడు కిలోలు మాత్రమే ఉండే బడి బ్యాగ్ తో ఏ ఇబ్బంది లేకుండా పాఠశాలకు వస్తున్నారు. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బడి బ్యాగ్ తేలికగా ఉండేలా చర్యలు తీసుకున్న ఎంఈవోను అభినందించారు. స్టేట్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలస్ కు ఎంఈవో పనితీరును వివరించారు. గట్టుభూత్కూర్ స్కూల్ లో అనుసరిస్తున్న స్కూల్ బ్యాగ్ విత్ లెస్ వెయిట్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యప్రకాష్, టీచర్స్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం పిలుపు

శెనార్తి మీడియా, తలమడుగు :

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుంచి కృషి చేయాలంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం పిలుపునిచ్చారు. బుధవారం తలమడుగు మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలమడుగు మండల కన్వీనర్‌గా నియమితులైన ధనుంజయ్‌ను పార్టీ తరపున సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనపై రాష్ట్ర ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొంది అని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ సాధించిందేమీ లేదని ఆరోపించారు. గ్రామాల స్థాయిలో బీజేపీకి విశేష ఆదరణ లభిస్తోందని, ఈ అనుకూలతను గెలుపుగా మలచుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు విపులంగా తెలియజేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జ్యోతి రెడ్డి, చంద్రకాంత్, ప్రభాకర్, మోహన్, ప్రేమేందర్ రెడ్డి, దాతాజీ కిరణ్, స్వామి శ్రీనివాస్, మహేందర్ యాదవ్, శేఖర్, ఆశన్న, అశోక్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.